క్లుప్తంగా

13 నుంచి ఉత్సవాలు

ఆస్పరి: మండలంలోని తొగలుగల్లులో ఈనెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఓబులేసు స్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు సోమవారం తెలిపారు. ఈ నెల 13న గ్రామ దేవతలకు, స్వామి వారికి అభిషేకం, కలశ, పల్లకీ సేవ, 14న ఆలయంలో స్వామి, అమ్మవార్లకు గంగ పూజ, పంచామృతాభిషేకం, మంగళహారతు లు, స్వామి వారి కల్యాణోత్సవం,15న ప్రభోత్సవం, బుక్క పిండి సేవ, నుగ్గులాట, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి



వలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: వార్డు వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని 32వ వార్డు ఇన్‌చార్జ్ కోటకొండ నరసింహులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 24వ వార్డు సచివాలయంలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లను సచివాలయ సిబ్బందితో కలిసి ఆయన సత్కరించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రజలకు సకాలంలో అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థతో పాటు వలంటీర్లను నియమించారన్నారు. వలంటీర్ల సేవలతో ప్రజల్లో తగిన గౌరవం దక్కుతోందన్నారు. సచివాలయ సిబ్బంది ఉన్నారు.

జగనన్నతోనే ప్రజాసంక్షేమం



4వ వార్డులో ప్రచారం చేస్తున్న బుట్టా ప్రతూల్

ఎమ్మిగనూరుటౌన్: సీఎం జగనన్నతోనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, టీడీపీని నమ్మి మోసపోవద్దని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు బుట్టా ప్రతూల్ సూచించారు. సోమవారం పట్టణంలోని 4వ వార్డులో వార్డు ఇన్‌చార్జ్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్యతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి మళ్లీ సీఎంగా జగనన్ననే ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు.కౌన్సిలర్లు కామర్తినాగేషప్ప, అమాన్, ఇషాక్, సుధాకర్, షాబుద్దీన్, తదితరులు ఉన్నారు.

మద్దికెరలో పోలీసు కవాతు



మద్దికెర: పత్తికొండ సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మద్దికెరలో కేంద్ర బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలకు భరోసా కల్పించేలా సెంట్రల్ ఫోర్స్, స్థానిక పోలీసులు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కవాతు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ గట్టి చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్టమైన చర్యలు చేపడతున్నామన్నారు. మద్ది కెర ఎస్‌ఐ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే వారికి పార్టీలో గుర్తింపు



మాట్లాడుతున్న జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్ సురేందర్ రెడ్డి

ఆలూరు: పార్టీని బలోపేతం చేసేందుకు కష్టపడి పనిచేసే వారికి వైఎస్సార్‌సీపీలో గుర్తింపు ఉంటుందని జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ తెర్నేకల్ సురేందర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన సోమవారం హొళగుంద మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్టీలో కొనసాగుతూ ఇష్టానుసారంగా పని చేయవద్దన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

నేడు చేనేతల ఆత్మీయ సమ్మేళనం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వైడబ్ల్యూసీఎస్ (వీవర్స్ కాలనీ) మైదానంలో మంగళవారం సాయంత్రం నియోజకవర్గంలోని చేనేతల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బుట్టారంగయ్య సోమవారం తెలిపారు. సమ్మేళనానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టారేణుక ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని చేనేతలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

కార్మిక చట్టాలపై అవగాహన

ఆలూరు: కార్మిక చట్టాలపై అవగాహన కల్పించాలని అసిస్టెంట్ కమిషనర్ రమణమ్మ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆలూరు సహాయ కార్మిక శాఖ అధికారిణి కనకలక్ష్మి సమక్షంలో గతేడాది కార్మికులకు మంజూరు చేసిన సంక్షేమ పథకాలు ఆర్థిక సాయం తదితర అంశాలపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ప్రసూతి సాయం, మృతి చెందిన కార్మిక కుటుంబాలకు అందించిన సాయం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం

- సంక్షేమ సారథికి అండగా నిలుద్దాం
- నాడు చంద్రబాబు మోసం చేస్తే నేడు సీఎం జగన్ మేలు చేశారు
- చేయూత సభలో ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

గోనెగండ్ల: మహిళల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అగ్రతాంబూలం ఇచ్చి, అన్ని సంక్షేమ పథకాలు వారి పేరిట అమలు చేశారని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గోనెగండ్ల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వైఎస్సార్ చేయూత నాలుగో విడత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీలకు చెందిన 4,351 మంది మహిళలకు వైఎస్సార్ చేయూత నాలుగో విడత కింద ఒక్కొక్కరికి రూ.18,750 చొప్పున మొత్తం రూ.8.15 కోట్ల చెక్కును డీఆర్‌డీఏ అధికారుల సమక్షంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 2014లో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత మోసం చేశాడన్నారు. మళ్లీ ఇప్పుడు అధికారం కోసం మోసపూరిత హామీలు ఇస్తూ మాయమాటలు చెబుతున్నారని, ప్రజలు నమ్మవద్దన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న 99 శాతం హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మేలు జరిగి ఉంటే ఓటు వేయాలని సీఎం జగన్ కోరుతున్నారని, ఇప్పటివరకు ఇలా చెప్పిన నాయకుడు ఎవరూ లేరన్నారు. వైఎస్ జగన్‌ను ఎదుర్కోలేక చంద్రబాబు జనసేన, బీజేపీతో పొత్తు పెట్టుకొని నీతిమాలిన రాజకీయాలు చెస్తున్నారని విమర్శించారు. ప్రజా సంక్షేమానికి అహర్నిశలు కష్టపడుతున్న సీఎం జగన్‌కు మనందరం అండగా నిలవాలని, పార్టీ అభ్యర్థిని భారీ మేజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ టీ.నసురుద్దీన్, ఈఓఆర్డీ నాగేష్, ఎమ్మిగనూరు, గోనెగండ్ల కన్వీనర్లు బీఆర్ బసిరెడ్డి, దొరబాబు, యూత్ అధ్యక్షుడు బందెనవాజ్, వెంకట్రామిరెడ్డి, భాస్కర్ రెడ్డి, నాయుడు, పద్మనాభం, నదిముల్లా, ఏసీ శ్రీనివాసులు, ముక్కన్న, మధు తదితరులు పాల్గొన్నారు.

నందవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ చేయూత నాల్గవ విడత మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఏపీఎం చిన్నవీరన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారీలకు చెందిన 45 నుంచి 60 ఏళ్ల మహిళా లబ్ధిదారులకు వైఎస్సార్ చేయూత మెగా చెక్కును అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. చేయూత నాల్గవ విడత కింద మండలంలో 3,723 మంది లబ్ధిదారుల ఖాతాలో రూ.6.98 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. మహిళలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు.

లంచాలకు తావులేకుండా పాలన
– బీసీ సెల్ అధ్యక్షుడు విరుపాక్షిరెడ్డి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో లంచాలకు తావులేకుండా పరిపాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు, ముగతి గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ.. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థతో ప్రజల చెంతకే పాలన తీసుకొచ్చారన్నారు. ఇంటింటికీ సంక్షేమం అందిస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతుదన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, ఎమ్మిగనూరు మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి మాట్లాడారు. జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు, వైకేపీ ఏరియా కో– ఆర్డినేటర్ శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చీరల వ్యాపారం చేస్తున్నా



ప్రభుత్వం ఇప్పటివరకు నాకు నాలుగు విడతలుగా రూ.75 వేలు నేరుగా నా ఖాతాలో జమ చేసింది. ఈ సొమ్మతో చీరల వ్యాపారం నడుపుతున్నా. నా కుమారుడికి అమ్మ ఒడి వస్తోంది. నా కూతురు ఎంఎల్‌హెచ్‌పీగా పని చేస్తుంది. జగనన్న పాలనలో ఒక్క రూపాయి లంచం లేకుండా ఉద్యోగం, ప్రభుత్వ పథకాలు ఇంటి వద్దనే అందుకుంటున్నా. చాలా సంతోషంగా ఉంది. మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్ననే గెలిపించుకుంటాం.

– గ్రేషమ్మ, నందవరం

రూ.75 వేలు వచ్చింది



చేయూత పథకం కింద నాకు ఇప్పటివరకు నాలుగు విడతల్లో రూ.75 వేలు జమ అయ్యింది. ఈ సొమ్ము ఇంటి నిర్మాణానికి ఎంతో ఉపయోగపడింది. ప్రస్తుతం నాలుగో విడతలో వచ్చిన సొమ్ము రూ.18,750తో పొట్టేళ్లను కొనుగోలు చేసి పెంచాలనుకుంటున్నా. మాలాంటి పేదలకు సీఎం జగనన్న అండగా ఉండి ఆదుకుంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– కమలమ్మ, నందవరం

నేడు చేయూత చెక్కుల పంపిణీ

తుగ్గలి: మండల పరిధిలోని పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో మంగళవారం వైఎస్సార్ చేయూత నాలుగో విడత చెక్కును ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల, సచివాలయ అధ్యక్షుడు జిట్టా నాగేష్‌యాదవ్, హనుమంతు తెలిపారు. సాయంత్రం నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

కస్తూర్బా ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తుగ్గలి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో 2024–25 సంవత్సరంలో ప్రవేశాలకు మంగళవారం నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయం ప్రత్యేక అధికారిణి వి షాహీన్ తెలిపారు. 6వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు, 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందుతుందన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

మద్దికెర: ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మంగళవారం మద్దికెరకు వస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 10 గంటలకు దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరిస్తారని, అనంతరం ప్రధాన బజారులో రూ.18.50 లక్షలతో కాయగూరల మార్కెట్ నిర్మాణానికి భూమి పూజ, తర్వాత రైతు భరోసా కేంద్రం–1 ప్రారంభించడంతోపాటు వైఎస్సార్ చేయూత పథకానికి సంబంధించి లబ్ధిదారులకు మెగా చెక్కు పంపిణీ చేస్తారని వెల్లడించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చేయూత.. కొండంత భరోసా



పత్తికొండలో లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: మహిళా సాధికారతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. సోమవారం పత్తికొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం మధుబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ చేయూత చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి మహిళలతో కలిసి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలో 4,150 మందికి చేయూత నాలుగో విడత కింద మంజూరైన రూ.7.78 కోట్ల చెక్కును లబ్ధిదారులకు అందించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళల జీవనోపాధులు మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం చేయూత పథకాన్ని అమలుచేస్తున్నట్లు వివరించారు. వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఎంపీపీ నారాయణదాస్, జెడ్పీటీసీ ఉరుకుందమ్మ, మార్కెట్‌యార్డు చైర్మన్ పక్కీరప్ప, వైస్ ఎంపీపీ బలరాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమశేఖర్, బనగాని శ్రీనివాసులు, భాస్కర్‌నాయక్, ఎంపీడీఓ రామారావుపాల్గొన్నారు.

అభివృద్ధి చేసిన చూపిన ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడిందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం జూటూరు గ్రామంలో రూ.43 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.24 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.21 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను మాజీ సర్పంచ్ జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు భాస్కర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శ్రీదేవి ప్రారంభించారు. సాయంత్రం చక్రాళ్లలో రూ.43 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.24 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, గడప గడపకూ మన ప్రభుత్వం, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ.65 లక్షలతో పూర్తయిన సీసీ రోడ్డు పనులను సర్పంచు పూరి శ్రీరాములుతో కలిసి ప్రారంభించారు. ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకుడు వెంకటనాయక్, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, రంగానాయక్, సిద్ధరాముడు తదితరులు పాల్గొన్నారు. పందికోన గ్రామంలో రూ.43 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.23 లక్షలతో వేసిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే పార్టీ నాయకులు నాగరాజు, రవి తదితరులతో కలిసి ప్రారంభించారు. ఎంపీపీ నారాయణదాస్, జెడ్పీటీసీ ఉరుకుందమ్మ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ఎంపీడీఓ రామారావు, పంచాయతీరాజ్, అగ్రికల్చర్, వైద్యారోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చక్రాళ్ల గ్రామంలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

హాలహర్వి: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తహసీల్దార్ బ్యూల సూచించారు. ఈ మేరకు సోమవారం ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయాశాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెరిగిన బ్రహ్మగుండం ఆదాయం

వెల్దుర్తి(కృష్ణగిరి): బ్రహ్మగుండం క్షేత్రం మహాశివ రాత్రి ఉత్సవాల ఆదాయం గతేడాది కంటే రూ.5,217 పెరిగిందని ఆలయ ధర్మకర్త బొమ్మన పెద్దిరెడ్డి, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ టి.హనుమంత రావ్, ఈఓ ఆంజనేయులు తెలిపారు. సోమవారం ఉత్సవాల ముగింపు పురస్కరించుకుని నాలుగు రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించారు. బ్రహ్మేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.70,900, కామేశ్వరీదేవి హుండీ ఆదాయం రూ.35,561 లభించిందన్నారు. వేలాలు, దుకాణ సముదాయాలు, సేవా టికెట్ల ద్వారా రూ.3,75,778 మొత్తంగా రూ.4,82,239 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఆలయ అర్చకులు, దేవదాయ సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు

బ్రహ్మగుండం క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు సోమవారం వసంతోత్సవం, గ్రామోత్సవంతో ఘనంగా ముగిశాయి. ఆలయ అర్చకులు శివ, శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో బ్రహ్మేశ్వర స్వామి, కామేశ్వరీదేవి అమ్మవారు సర్వాభరణాల ప్రత్యేకాలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం గంగా, గౌరీదేవి సమేత బ్రహ్మేశ్వరస్వామి ఉత్సవమూర్తులను భక్తులు, ఆయకట్టుదారులు ఎద్దుల బండిపై ఉంచి మేళతాళాల మధ్య ఆలయ ప్రాకారం చుట్టూ తిప్పుతూ రంగునీరు చల్లుతూ వసంతోత్సవం జరిపారు. సాయంత్రం వెల్దుర్తి పట్టణ పురవీధుల్లో ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు.

జయప్రదం చేయండి

గోనెగండ్ల: ఈనెల 13న గోనెగండ్లలోని బాషా ఫంక్షన్ హాలు నందు నిర్వహించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు టీ.నాగేష్‌నాయుడు, మురళినాయుడు పిలుపునిచ్చారు. సోమవారం వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే న్యాయం జరిగిందని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రవికుమార్ నాయుడు, పేట అల్లాబకాష్, ఓబులయ్య, హుసేన్‌పటేల్, లింగన్న, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం





మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, సమన్వయకర్త బుసినె విరూపాక్షి

- బెంజ్, గంజ్ నాయకులకు భయపడొద్దు
- కార్యకర్తలకు అండగా ఉంటాం
- టీడీపీ, బీజేపీ, జనసేన ఏకమైనా ఫ్యాన్ స్పీడును తాకలేరు

ఆలూరు: 2024 ఎన్నికల్లో నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా బీవై రామయ్య పిలుపునిచ్చారు. ఆలూరులోని ఇబ్రహీం ఫంక్షన్ హాల్లో సోమవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరూపాక్షి ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మండల కన్వీనర్లు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, జేసీఎస్ కో–ఆర్డినేటర్ తెర్నెకల్ సురేంద్ర రెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బొజ్జమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా ఉపాధ్యాక్షురాలు యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీవై రామయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించి వైఎస్సార్‌సీపీ ఓటు వేసేలా కృషి చేయాలన్నారు. బెంజ్, గంజ్ గాళ్లకు భయపడాల్సిన అవసరం లేదని, కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఏకమైనా ఫ్యాన్ స్పీడ్‌ను అడ్డుకోలేరని ఎద్దేవా చేశారు. సంక్షేమ పాలన అందించిన సీఎం జగనన్నను నిండు మనసుతో ఆశీర్వదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు వెంకటరెడ్డి, అరుణకుమార్, జనార్దన్ నాయుడు, ఎంపీపీలు రంగమ్మ, లక్ష్మీదేవి, హేమలత, నెట్టికంటమ్మ, షేకున్‌బీ, ఉమాదేవి, జెడ్పీటీసీలు ఏరూరుశేఖర్, దొరబాబు, మండల కన్వీనర్లు ఈరన్న, పెద్దయ్య, రామిరెడ్డి, షఫిఉల్లా, శ్రీనివాసులు, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని సమన్వయకర్త బుసినె విరూపాక్షి పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ.. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ఇంటింటికీ వెళ్లి వివరించి పార్టీకి ఓటు వేసేలా కృషి చేయాలన్నారు. చంద్రబాబు మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. వైఎస్ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపిస్తేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం మంగళవారం ఉదయం 9 గంటలకు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ఈరన్న, కో కన్వీనర్ వీరేష్ తెలిపారు. కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

విజేత గద్వాల వృషభాలు

నందవరం: గురజాల గ్రామంలో నిర్వహించిన బండలాగుడు పోటీల్లో గద్వాల జిల్లాకు చెందిన వినీల్‌రాయుడు వృషభాలు విజేతగా నిలిచాయి. దాత బుట్టా ప్రతూల్ వృషభాల యజమానికి రూ.40 వేలు నగదు బహుమతి అందజేశారు. తరువాతి స్థానాల్లో నిలిచిన ఎమ్మిగనూరు మండలం గుడికల్ దాసుకు రూ.30 వేలు దాత గంగాధర్ రెడ్డి, అయిజ మండలం దేవబండ భాస్కర్ గౌడ్‌కు రూ.20 వేలు, నందవరం మేఘనాథ్‌కు రూ.10 వేలు అందజేశారు. సర్పంచ్ వీరస్వామి, దాతలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోండి

హాలహర్వి: ఈ నెల 14న గూళ్యంలో గాదిలింగేశ్వర స్వామి జోడు రథోత్సవాలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్‌ఐ నరేంద్ర సూచించారు. సోమవారం గూళ్యం గ్రామంలో ఇరువర్గాల ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. బారికేడ్లు పరిశీలించారు. ఉత్సవాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



ఈవీఎం పనితీరును వివరిస్తున్న ఎన్నికల ఆర్‌ఓ చిరంజీవి

ఎమ్మిగనూరురూరల్: ఎన్నికల విధుల్లో ఉండే అధికారులు అప్రమతంగా ఉండాలని రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో నోడల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో ఏ చిన్న పొరపాటు జరిగినా పెద్ద సమస్య అయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఈవీఎంలు ఎలా పనిచేస్తున్నాయి. ఏమైనా సమస్య ఉందా అనేది ఎన్నికల ముందురోజే చెక్ చేసుకోవాలని, ఏమైనా సమస్య ఉంటే వెంటనే ఏఆర్వో దృష్టికి తీసుకురావాలన్నారు. నోడల్ అధికారులు తమ పరిధిలో ఉండే అధికారులతో సమన్వయం చేసుకొని విధులు నిర్వహించాలన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్ మహబుబ్‌బాషా ఈవీఎంలను ఎలా ఉపయోగించాలి, ఏ బటన్ నొక్కాలి, ఎలా లాక్ చేయాలి, యంత్రం పనితీరును డెమో చేసి చూయించారు. సమావేశంలో తహసీల్దార్లు శేషారెడ్డి, ఓబులేషు, భూపతిపార్వతి, ఎన్నికల డీటీ గురురాజరావు, ఎంఈఓ–2 మధుసూదన్‌రావు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్వోలకు శిక్షణ:

మండల పరిషత్ సమావేశ భవనంలో సోమవారం సాయంత్రం బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి చిరంజీవి, తహసీల్దార్ శేషారెడ్డి మాట్లాడుతూ బీఎల్వోలు విధులను సమర్థవంతంగా నిర్వహించాలని చెప్పారు. ఈవీఎం యంత్రాల పనితీరు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌ల పనితీరుపై అవగాహన కల్పించారు. ఆర్‌ఐ లక్ష్మణ్, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సేవల్లో అంతరాయం రానీయొద్దు



మాట్లాడుతున్న డీఈఈ నాగేంద్ర

ఆలూరు రూరల్: వేసవి ప్రారంభమైన నేపథ్యంలో వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆలూరు విద్యుత్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగేంద్ర సూచించారు. ఆయన సోమవారం స్థానిక డీఈఈ కార్యాలయంలో సబ్ డివిజన్‌లోని విద్యుత్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లతో సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ.. విద్యుత్‌లైన్ మరమ్మతులు చేసేటప్పుడు ఎర్తింగ్ రాడ్లు వేసుకోవాలన్నారు. ఎల్‌సీ తీసుకునేటప్పుడు, రిటర్న్ ఇచ్చేటప్పుడు ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎప్పటికప్పుడు చెక్ చేయాలన్నారు. లో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా చూడాలని, వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించాలని సూచించారు. అలాగే విద్యుత్ సిబ్బంది పీఎం సూర్య ఘర్ యాప్ నమోదు చేసుకుని వారి పరిధిలోని విద్యుత్ కనెక్షన్ల వివరాలు నమోదు చేయాలన్నారు. విద్యుత్ బిల్లులు సకాలంలో వసూలు చేయాలన్నారు. ఏఈలు లోకేష్,ఉలిగప్ప, జమ్మన్న ఉన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న కంగాటి రామ్మోహన్ రెడ్డి

వెల్దుర్తి(కృష్ణగిరి): బ్రహ్మగుండం క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ధర్మకర్తల మండలి చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సీనియర్ కేటగిరీ వృషభాల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు. 12 జతల వృషభాలు పాల్గొనగా విజేతగా కోడుమూరు మండలం వల్కూరు దొడ్డికాటి తిరుమలేశ్, పందికోన ఉప్పరి సుందరప్పల సంయుక్త జత నిలిలిచాయి. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, దాత బొమ్మన రవిరెడ్డి చేతులమీదుగా వారికి రూ.50 వేల నగదు బహుమతి అందజేశారు. వీరికే చెందిన మరో సంయుక్త జత ఐదో స్థానంలో నిలవగా రూ.10 వేలు అందజేశారు. రెండవ, మూడవ, నాల్గవ స్థానాలలో వరుసగా అనంతపురం జిల్లా మేడిమాకుల పల్లె తోట తిరుపాల్ వృషభాలు, ప్యాపిలి పీఆర్‌పల్లె నాగయ్య, కొత్తకోట గుర్నాథ్ వృషభాలు సంయుక్తంగా, కొత్తకోట గుర్నాథ్, యాడికి శ్రీరాములు వృషభాలు సంయుక్తంగా నిలవడంతో రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేల నగదు అందజేశారు. అలాగే నాయకుల చేతులమీదుగా వృషభ యజమానులకు జ్ఞాపికలను అందించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి జత వృషభ యజమానులకు రూ.3 వేల చొప్పున ప్రోత్సాహకం అందించారు.

స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు

దేవనకొండ: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో రెవెన్యూ, ఇంటి పట్టాలు, రేషన్ కార్డులకు సంబంధించి పలు అర్జీలు వచ్చాయి. అనంతరం తహసీల్దార్ వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. స్పందన అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గడ్డివాముల దగ్ధం

నందవరం: మండల పరిధిలోని గురజాల గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. సోమవారం బాధిత రైతులు జానప్ప, సత్యారెడ్డి, రాజన్న మాట్లాడుతూ.. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివాములకు నిప్పు పెట్టారన్నారు. రైతులు, స్థానికులు మంటలు అదుపు చేయడానికి ప్రయత్నించినా వీలుకాలేదు. సామాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈలోపే గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. ముగ్గురు రైతులకు రూ.1.90 లక్షలు నష్టం వాటిల్లింది.